నమస్తే తెలంగాణ
# కరీంనగర్
5 | కరీంనగర్, సోమవారం 31 మార్చి 2025 | KARIMNAGAR



### ఇంకా ఒక్కటే తడుపంటే సరిపోదు

మాది కాల్వశ్రీరాంపూర్ మండలం మల్యాల. గ్రామ శివారులో నాకు నాలుగెకరాల భూమి ఉన్నది. సన్న రకం నెల్లూరు సాంబ అనే వెరైటీ సాగు చేసిన. వాన కాలంలో బోనస్ ఇచ్చినట్టుగానే యాసంగిలో కూడా ఇస్తామంటే, సాగుచేసిన. ఇప్పుడే పొట్టకు వచ్చి ఈనే దశలో ఉన్నది. మరో 20 రోజులు నీళ్లు అవసరం. కానీ ప్రభుత్వం ఏప్రిల్ 2 వరకు చివరి తడుపు ఇస్తామంటే మాసోంటి రైతుల గతేంకాను. నోట్లోకి వచ్చిన పంట ఎండిపోయే పరిస్థితి ఉంటది. ప్రభుత్వం స్పందించి మరో 20 రోజులు నీరందించాలి. రైతులను ఆదుకోవాలి.

**- పడాల కుమారస్వామి, రైతు, మల్యాల (కాల్వశ్రీరాంపూర్)**

### ఇంకో తడుపు నీళ్లివ్వాలి



జిల్లా అంతట వేరు. మా మంథని ఏరియాలో వేరు. ఎందుకంటే మేం 20రోజులు ఆలస్యంగా నాట్లు వేస్తం. మాకు అట్లాంటి పరిస్థితే ఉంటది. ఏప్రిల్ 2న చివరి తడుపు ఇస్తే సరిపోదు. ఇంకో తడుపు అయితేనే పొలం బతుకుతది. లేకుంటే తీవ్రంగా పంట నష్టపోతం. ప్రభుత్వం స్పందించి ఏప్రిల్ రెండో వారంలో మరో తడుపు ఇవ్వాలి. లేకపోతే చేతికచ్చిన పంట పోతది.

**- బీమోజు రాజయ్య, రైతు, గద్దలపల్లి (మంథని)**



కరీంనగర్ రూరల్ మండలంలో సాగునీరు లేక బీటలు వారిన పొలం

# పంటలు చేతికి రాకముందే నీళ్లు బంద్!

## ఎస్సారెస్పీ జోన్-2కు వచ్చే నెల 2న.. జోన్-1కు 9న తడుల నిలిపివేత

**ఎస్సారెస్పీ ఆయకట్టు రైతాంగం ఆగమైతున్నది. పంట చేతికి రాకముందే మరో పది రోజుల్లో యాసంగి పంటలకు వారబంధీ తడులు బంద్ చేస్తామన్న ప్రకటనతో ఆందోళన పడుతున్నది. గతేడాది డిసెంబర్‌లో రూపొందించిన నీటి పంపిణీ ప్రణాళిక ప్రకారం జోన్-2 పరిధిలోని డిస్ట్రిబ్యూటరీలకు వచ్చే నెల 2న ఉదయం 6 గంటలకు, జోన్-1 పరిధిలో కాలువలకు 9వ తేదీ ఉదయం 6 గంటలకు నీటి పంపిణీని నిలిపివేస్తామని అధికారులు ఇటీవల పేర్కొనగా, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల పరిధిలోని కర్షకులు ఆవేదన చెందుతున్నారు. నీరు వస్తుందనే నమ్మకంతో జనవరి నెల చివరి వరకు నాట్లు వేశామని, ఇంకా కోతకు రాకముందే కచ్చితంగా నీరందించాల్సిన టైంలో సరఫరా ఆపివేస్తే తీవ్రంగా నష్టపోతామని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి మరో రెండు తడులు ఇవ్వాలని కోరుతున్నారు.**



ఎండపల్లి మండల కేంద్రంలో ఎండిపోయిన పొలం

జగిత్యాల, మార్చి 30(నమస్తే తెలంగాణ)/ పెద్దపల్లి (నమస్తే తెలంగాణ) : యాసంగిలో ఎస్సారెస్పీ ప్రాజెక్టు పరిధిలోని జోన్ 1, 2 పరిధిలో ఉన్న నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలో 4,42,920 లక్షల ఎకరాల పంటలకు నీరందించేందుకు ఎస్సారెస్పీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. డిస్ట్రిబ్యూటరీ 5 నుంచి 53 వరకు జోన్-1గా, డిస్ట్రిబ్యూటరీ 54 నుంచి 94 వరకు జోన్ -2గా వర్గీకరించారు. జోన్-1కు ఏడు రోజులు ఆన్, 8 రోజులు ఆఫ్‌గా.. జోన్-2కు 8 రోజులు ఆన్, 7 రోజులు ఆఫ్ పద్ధతిలో ఇవ్వాలని నిర్ణయించారు. అయితే డిసెంబర్ 25న ఎస్సారెస్పీలో 80.501 టీఎంసీల నీరు ఉండగా, అందులో 63.85 టీఎంసీలు ఈ రెండు జోన్ల పరిధిలోని పంటలకు ఇవ్వాలని ప్రణాళిక రూపొందించారు. ఈ క్రమంలో డిసెంబర్ 25న వారబంధీ పద్ధతిలో తొలుత కాకతీయ కాలువ ద్వారా జోన్-2కు నీటి విడుదలను ఆరంభించారు. ఈ యేడాది జనవరి 2న జోన్-1కు నీటి విడుదల చేశారు. దాదాపు రెండు నెలలుగా వారాబంధీ పద్ధతిలో సరఫరా చేస్తున్నారు.

### తప్పని సాగునీటి తిప్పలు

వారబంధీ పద్ధతిలో నీటి విడుదల కొనసాగుతూ వస్తున్న జోన్ -1, 2 డిస్ట్రిబ్యూటరీల పరిధిలో రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. కాలువల నిర్వహణ సరిగా లేకపోవడం, చాలా చోట్ల కెనాళ్లపై మోటర్లు పెట్టి నీటిని తోడుకుంటూ ఉండడం, నీటి చౌర్యం, కాలువల నిర్వహణలపై అధికారుల నిఘా సరిగా లేకపోవడంతో చివరి ఆయకట్టు ప్రాంతాలకు నీరు సరిగా అందక ఇప్పటికే వేలాది ఎకరాల్లో పంట దెబ్బతిన్నది. ఎస్సారెస్పీ అధికారుల అంచనాల ప్రకారమే ప్రాజెక్టు పరిధిలోని కాలువల వెంబడి 3వేల మోటర్లు పనిచేస్తుండగా, వదిలిన నీటిలో 500 క్యూసెక్కులను అవే లాగేస్తున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. వాస్తవానికి క్షేత్రస్థాయిలో ఐదువేల వరకు విద్యుత్ మోటర్లు పెట్టి నీటిని తోడుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ మోటర్లపై అధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో చివరి ఆయకట్టు రైతులకు నీరందని పరిస్థితి ఎదురైంది. దీనికి తోడు కాకతీయ ప్రధాన కాలువతోపాటు, డిస్ట్రిబ్యూటరీ కాలువలకు చాలా చోట్ల లైనింగ్‌లు లేవు. పిచ్చిమొక్కలు మొలిచి ధ్వంసమైపోవడం, నీరు వృథాగా పోతుండడం రైతుల పాలిట శాపంలా మారింది. జోన్ -1 పరిధిలో ఉన్న జగిత్యాల జిల్లాలోనే పలు డిస్ట్రిబ్యూటరీల చివరి ప్రాంతాలకు నీరందని పరిస్థితి నెలకొనడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జోన్- 1 పరిధిలోకి వచ్చే డీ 53 డిస్ట్రిబ్యూటరీ ద్వారా నీటి పంపిణీ జరిగే సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని చివరి ఆయకట్టు ప్రాంతాలైన బట్టపెల్లి, పోతారం లాంటి గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. జోన్-2 పరిధిలో ఉన్న డీ83/ఏ డిస్ట్రిబ్యూటరీ పరిధిలోకి వచ్చే వెల్గటూర్, తదితర మండలాల్లోని గ్రామాలకు సైతం నీరందక రైతులు తీవ్రంగా అవస్థలు పడ్డారు. ఇక పెద్దపల్లి జిల్లాకు సాగునీరందించే డిస్ట్రిబ్యూటరీలు 83, 86 పరిధిలోని చివరి ఆయకట్టు ప్రాంతాల రైతులు గత పదేండ్లుగా ఏనాడు ఎదుర్కొనంత ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే భారీగా పంటలు దెబ్బతినడంతో పొలాలను పశువులకు మేతకు వదిలేస్తున్నారు.

### రెండు జోన్లకు నీటి విడుదల నిలిపివేత

మరో పది రోజుల వ్యవధిలో ప్రాజెక్టు పరిధిలోని జోన్-1,2 పరిధిలోని డిస్ట్రిబ్యూటరీలకు నీటి విడుదలను నిలిపివేస్తామని అధికారులు ప్రకటించారు. డిసెంబర్25న జోన్-2 పరిధిలోని కెనాళ్లకు వారబంధీ పద్ధతిలో ప్రారంభమైన నీటి విడుదల ప్రక్రియ ఏప్రిల్ 2న గడువు ముగుస్తుందని, జోన్-1 పరిధి ఆయకట్టుకు ఏప్రిల్ 9న గడువు ముగుస్తుందని అధికారులు పేర్కొంటూ వచ్చారు. అయితే ప్రాజెక్టులో గతేడాదితో పోలిస్తే దాదాపు ఏడెనిమిది టీఎంసీల నీరు అధికంగా ఉన్న నేపథ్యంలో ఏప్రిల్ మూడో వారం వరకు పంటలకు నీటి తడులు ఇస్తారన్న నమ్మకంతో ఇన్నాళ్లు రైతులు సేద్యం చేస్తూ వచ్చారు. అయితే ఏప్రిల్ మొదటి వారంలో నీటి తడులు నిలిపివేస్తామని స్పష్టంగా ప్రకటించడంతో రైతులు తీవ్రంగా భయపడుతున్నారు. వాస్తవానికి నవంబర్ చివరి వారంలోను, డిసెంబర్ మొదటి వారంలో పంట ప్రారంభించిన వారికి ఏప్రిల్ మొదటి వారం వరకు పంట కోతకు వచ్చే అవకాశం ఉంది. అయితే ఈ ఏడాది ఎస్సారెస్పీ ప్రాజెక్టు పరిధిలో యాసంగి నార్లు పోయడం ఆలస్యమైంది. జనవరి చివరి వారం వరకు నార్లు పోస్తూనే వచ్చారు. చివర్లో నాట్లు వేసిన రైతులకు పంట ఏప్రిల్ చివరి వారం నుంచి మే మొదటి రెండు వారాల్లో కోతకు వస్తాయి. వారబంధీ పద్ధతిలో నీటి విడుదల చేసిన సమయంలోనే ఆయకట్టు చివరన ఉన్న తమకు నీరు రావడం లేదని, ఏప్రిల్ 9వ తేదీ నాటికే నీటి తడులు నిలిచిపోతే పంట పూర్తిగా నష్టపోయినట్లేనని బాధపడుతున్నారు.

- రెండు జోన్ల పరిధిలోని చివరి ఆయకట్టుకు ఇబ్బంది
- నీరు వస్తుందన్న నమ్మకంతో జనవరి చివరి వరకు వరినాట్లు వేసిన రైతులు
- ప్రభుత్వ నిర్ణయంతో ఆందోళన
- మరో రెండు తడులు ఇవ్వకపోతే మునిగిపోతామని ఆవేదన



శ్రీరాంసాగర్ జలాశయం

### సన్నాల రైతు పరిస్థితి అగమ్యగోచరం

ఎస్సారెస్పీ నుంచి నీటి విడుదల నిలిపివేస్తామని అధికారులు చెబుతున్న మాటలతో సన్నాల సాగు చేసిన రైతులు, ఆలస్యంగా పంటలు వేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. మార్కెట్‌లో అత్యంత గిరాకీ ఉన్న సన్నాలు పండిస్తే బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలో ఎక్కువ మంది సాగు చేసిన విషయం తెలిసిందే. అయితే దొడ్డురకం కంటే సన్నరకం సాగు చేయడం కష్టంతో, ఇబ్బందులతో కూడుకుంటుంది. దొడ్డురకం పంటకాలం 135 రోజులు కాగా, సన్నరకం పంటకాలం 165 రోజులు. నెల రోజులు అదనంగా రైతు శ్రమించాల్సిన పరిస్థితి. పంటపెట్టుబడి సైతం పెరుగుతుందని, సాధారణ రకాల సాగు పెట్టుబడితో పోల్చిచూస్తే ఎకరానికి ₹4వేల నుంచి ₹5వేల వరకు అధికంగా పెట్టుబడి అవుతుందని రైతులు చెబుతున్నారు. పంట కాలం అధికంగా ఉండడంతో సన్నాలకు నీటి తడులు సైతం ఎక్కువగానే ఇవ్వాల్సిన అవసరం ఉంటుందని పేర్కొంటున్నారు. ఇప్పుడు 130-150 రోజుల మధ్యలోనే నీటి తడులను నిలిపివేస్తే తమ పంటలు ఏం కావాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక దొడ్డ రకానికి సంబంధించిన పంటను సాగు చేస్తున్న రైతులు కొందరు జనవరి మధ్య వారం నుంచి చివరి వారం వరకు నాట్లు వేశారు. పంట ఇప్పుడు 90-110 రోజుల మధ్యలో ఉందని, మరో పదిహేను నుంచి ఇరవై రోజుల పాటు తడి అవసరమని ఇప్పుడే నీటి విడుదల నిలిపివేస్తే తమ గతేం..? కావాలని రైతులు దిగులు పడుతున్నారు. ప్రభుత్వం ఈ విషయంలో ఆలోచన చేయాలని కోరుతున్నారు.

### ప్రత్యామ్నాయం చూపాలని వేడుకోలు

ఆయకట్టు చివరి రైతులతో పాటు, ఎస్సారెస్పీ డిస్ట్రిబ్యూటరీల పరిధిలో పంటలు సాగు చేస్తున్న చాలా మంది రైతులు ఏప్రిల్ చివరి వారం వరకు నీటి తడులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో కేసీఆర్ హయాంలో కాళేశ్వరం నుంచి నీటిని ఎత్తిపోసి, డిస్టిబ్యూటరీల ద్వారా నీటిని విడుదల చేశారని, ఇప్పుడు సైతం అలాగే నీరందించాలని కోరుతున్నారు. లేదంటే రైతుల పంటలకు ప్రత్యామ్నాయాలు చూపాలని కోరుతున్నారు. ఇలా అర్ధంతరంగా తమను వదిలేయవద్దని వేడుకుంటున్నారు.



# 'పారితోషికం' ఇచ్చేదెన్నడు?

మామిడిపల్లిలో ఇంటింటా కులగణన సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

- కులగణన సర్వే చేసి నాలుగు నెలలు
- గౌరవవేతనం కోసం ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్ల ఎదురుచూపులు
- సిరిసిల్ల జిల్లాలో 2,900పైగా సిబ్బందికి ₹2కోట్ల బకాయిలు
- వెంటనే అందించాలని విజ్ఞప్తులు



**రాష్ట్ర ప్రభుత్వం గతేడాది నవంబర్‌లో ఇంటింటా సమగ్ర కుటుంబ సర్వే చేపట్టింది. అందుకోసం ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లను నియమించింది. ప్రభుత్వ ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, మున్సిపల్ వార్డు అధికారులను ఈ సర్వేలో భాగస్వాముల్ని చేసింది. ఒక్కొక్కరూ 120-170వరకు కుటుంబాల చొప్పున 56అంశాలతో కూడిన సమాచారాన్ని సేకరించగా, ఈ ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. అయితే సర్వే పూర్తయి నాలుగు నెలలు అవుతున్నా పారితోషికం ఇవ్వకపోవడంపై సర్వే చేసిన సిబ్బందిలో ఆగ్రహం వ్యక్తమవుతున్నది.**

కోనరావుపేట, మార్చి 30: రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా గతేడాది చేపట్టిన ఇంటింటా సమగ్ర కుటుంబ సర్వేలో 1,531మంది ఎన్యూమరేటర్లు, 150మంది సూపర్‌వైజర్లుగా విధులు నిర్వర్తించారు. ఒక్కో ఎన్యూమరేటర్ 120 నుంచి 170 కుటుంబాల వరకు సర్వే చేసి వివరాలను సేకరించారు. జిల్లాలోని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో మొత్తంగా 1,93,310 కుటుంబాల వివరాలను ఎంట్రీ చేశారు. ఒక్కో కుటుంబానికి ఎనిమిది పేజీలతో కూడిన సర్వే ఫారంలో 75రకాల ప్రశ్నలతో ఎన్యూమరేటర్లు ఎంతో ఓపికతో వివరాలు నమోదు చేశారు. ప్రభుత్వ ఒత్తిడితో 10నుంచి 18రోజుల్లోనే సర్వే పూర్తి చేసి చేశారు. అంతేకాకుండా రెండో విడుతలో సైతం సర్వే చేయించారు. అయితే ఇప్పటికీ చేసిన సర్వేకు గౌరవ వేతనం ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

### పారితోషికం ఇలా..

సర్వేలో పాల్గొన్న ఎన్యూమరేటర్లకు ₹10వేలు, సూపర్‌వైజర్లకు ₹12వేలు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కుటుంబ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చిన డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఒక్కో దరఖాస్తు చొప్పున రూ.25ఇస్తామని చెప్పింది. జిల్లాలో 1,93,310 కుటుంబాల డాటా ఎంట్రీ కోసం 1,300కు పైగా ఆపరేట్లతో డాటా ఎంట్రీ చేయించారు. దీంతో కులగణన సర్వేచేసిన వారికి సుమారు ₹2కోట్లు వరకు గౌరవ వేతనం చెల్లించాల్సి ఉన్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే గౌరవ వేతనం చెల్లించాలని ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

### అధికారులు చొరవచూపాలి



కులగణన సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లిన. 237ఇండ్ల వివరాలను ఆన్‌లైన్ నమోదు చేసిన. నాలుగు నెలలు గడుస్తున్నా అధికారులు మాత్రం ఇంకా డాటా ఎంట్రీ పైసలిస్తలేరు. ఉపాధి లేకపోవడంతోనే డాటా ఎంట్రీ చేసేందుకు వెళ్లిన. కానీ ఇలా డబ్బులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నా. అధికారులు ప్రత్యేక చొరవ చూపి డబ్బులు చెల్లించాలి.

**- సోలంకి అరవింద్, డాటాఎంట్రీ ఆపరేటర్, ఆరెపల్లి (వేములవాడ రూరల్)**

### నాలుగు నెలలైనా ఇస్తలేరు



ప్రభుత్వం గత నవంబర్‌లో కులగణన సర్వే చేయించి మాతో డాటా ఎంట్రీ చేయించింది. ఇంటి వద్ద ఖాళీగా ఉండలేక.. ఉపాధి కోసం అధికారులు చెప్పగానే డాటా ఎంట్రీ చేసేందుకు వెళ్లిన. డాటా ఎంట్రీ చేసి నాలుగు నెలలైనా ఇప్పటికీ డబ్బులిస్తలేరు. ఒక్కో దరఖాస్తుకు ఎంత పారితోషికం ఇస్తారో కూడా చెప్పలేదు. అధికారులను అడిగితే ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదంటున్నరు. కలెక్టర్ స్పందించి గౌరవ వేతనం అందించాలి.

**- పల్లి వినయ్, డాటాఎంట్రీ ఆపరేటర్, సుద్దాల (కోనరావుపేట)**

# మార్కెట్ కార్యదర్శి అవినీతి ఇంతింత కాదయా..?



కార్యదర్శిని ఏసీబీ పట్టుకున్న తర్వాత మాట్లాడుతున్న పండ్ల వ్యాపారులు

- పగిలిన మార్కెట్ కమిటీ సెలెక్షన్ గ్రేడ్ కార్యదర్శి పాపాలపుట్ట
- పండ్ల వ్యాపారుల నుంచే కాదు, కూరగాయల వ్యాపారుల నుంచీ వసూళ్లు!
- ఐదేళ్లలో ₹5 కోట్లు అక్రమంగా సంపాదించారనే ఆరోపణలు
- వేధింపులు భరించలేకే పట్టించామంటున్న వ్యాపారులు



పురుషోత్తం

**ఏసీబీకి చిక్కిన కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సెలెక్షన్ గ్రేడ్ కార్యదర్శి ఏ పురుషోత్తం అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఐదేళ్ల క్రితం కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ఆయన విచ్చలవిడిగా అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు వస్తున్నాయి. తాజాగా అవినీతి నిరోధక శాఖకు చిక్కిన ఆయన, ఐదేళ్ల అక్రమ సంపాదన ₹5 కోట్లకు మీదనే ఉంటుందని పండ్ల వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ఆయన వేధింపులు భరించలేకనే ఏసీబీకి పట్టించామని స్పష్టం చేస్తున్నారు.**

కరీంనగర్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): ఓ పండ్ల వ్యాపారి నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సెలెక్షన్ గ్రేడ్ కార్యదర్శి పురుషోత్తం అవినీతికి అడ్డూ అదుపు ఉండదనే ఆరోపణలున్నాయి. లంచం కోసం ఎంతకైనా తెగిస్తాడనే విమర్శలున్నాయి. ఆయన వేధింపులు భరించలేకనే కార్యదర్శిని ఏసీబీకి పట్టించామని పండ్ల వ్యాపారులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పుడు ఆయన అవినీతి చిట్టా విప్పుతున్నారు. 12 మంది పండ్ల వ్యాపారుల లైసెన్స్‌ల రెన్యూవల్ కోసం వేధించాడని, ఒక్కో వ్యాపారి ₹2లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడని, ఓ మంత్రితో చెప్పించినా వినలేదని, తమ వల్ల కాదని చెప్పడంతో చివరకు ₹60వేలకు ఒప్పుకొన్నాడని వివరిస్తున్నారు. ఈ క్రమంలోనే పండ్ల మార్కెట్ వ్యాపారుల అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ గఫూర్ అలియాస్ నిమ్మకాయల పాషా నుంచి శనివారం ₹60 వేలు లంచం తీసుకుంటూ కార్యదర్శి పురుషోత్తంతోపాటు ఔట్ సోర్సింగ్ సెక్యూరిటీగార్డు కరివేద శ్రీనివాస్ రెడ్డి ఏసీబీ అధికారులకు చిక్కారు. అయితే గతేడాది నలుగురు పండ్ల వ్యాపారుల లైసెన్స్‌లు రెన్యూవల్ చేసేందుకు ఒక్కొక్కరి నుంచి ₹లక్ష లంచంగా తీసుకున్నాడని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. పండ్ల వ్యాపారులనే కాదు, కూరగాయల వ్యాపారులను సైతం వదలరని చెబుతున్నారు. స్థానిక రైతు బజార్లలో కూరగాయల వ్యాపారం చేసుకునే 72 మంది నుంచి పెద్ద మొత్తంలో లంచాలు తీసుకున్నారని చర్చించుకుంటున్నారు. ఒక్కొక్కరి నుంచి ₹20 వేలు లంచం తీసుకొని, వారి లైసెన్స్‌లు రెన్యూవల్ చేసినట్టు తెలుస్తున్నది. లంచాల కోసం వేధించడమే పనిగా పెట్టుకున్న కార్యదర్శి తాము వ్యాపారం చేసుకునేందుకు కూడా పూర్తి స్థాయిలో సహకరించేవాడు కాదని వ్యాపారులు చెబుతున్నారు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మార్కెట్లకు అన్ని వసతులు కల్పించాల్సిన బాధ్యత మార్కెట్ కమిటీలకు ఉంటుంది. కానీ ఈ కార్యదర్శి మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించేవారనే ఆరోపణలున్నాయి. రైతులు పండ్లు తీసుకుని మార్కెట్‌కు వస్తే గేట్లు మూయించి ఇక్కడ వ్యాపారులు లేరని, వరంగల్ మార్కెట్‌కు వెళ్లమని వారితో చెప్పించేవారని రైతులు చెబుతున్నారు. అంతే కాకుండా రాత్రి పూట మార్కెట్ నడుస్తుండగానే తన సిబ్బందిని ఆదేశించి విద్యుత్తు సరఫరా నిలిపివేయించే వారని మండిపడుతున్నారు. లైసెన్స్‌ల కోసమే కాకుండా నెల నెలా మామూళ్లు డిమాండ్ చేసే వారని, ఇవ్వక పోతే ఇబ్బందులు పెట్టే వారని వివరిస్తున్నారు.

### వేధింపులు భరించలేకనే పట్టిచ్చినం



మార్కెటింగ్ కార్యదర్శి పురుషోత్తం లంచాల కోసం మా వ్యాపారులను తీవ్రంగా వేధించేవాడు. పోయిన సారి నా లైసెన్స్ రెన్యూవల్ కోసమే రూ.లక్ష ఇచ్చిన. ఇంట్లో బంగారం కుదువ పెట్టి, అక్కడా ఇక్కడా అప్పులు చేసి లంచాలు ఇవ్వాల్సి వస్తంది. నేను చాలా సార్లు చెప్పి చూసిన. వినలేదు. పెద్దోళ్లకు చెప్పుకొంటే.. ఆయన దగ్గరికి ఎందుకు పోయినవ్? ఈయన దగ్గరికి ఎందుకు పోయినవ్? అని బెదిరిస్తుండె. మార్చి నెలాఖరుకు లైసెన్స్‌లు రెన్యూవల్ చేసుకోవాలె. ఎంత బతిమిలాడినా పైసలు ఇవ్వకుంటే రెన్యూవల్ చేయనని చెప్పిండు. మమ్మల్ని అందరినీ ఆయన చాంబర్‌లోనే కూసోపెట్టి లంచం డిమాండ్ చేసిండు. ఏసీబీకి పట్టియ్యాల్నని ఇష్టమని ఒప్పుకున్నం. మా కొడుకు ఫజల్ పేరున ఉన్న లైసెన్స్ రెన్యూవల్ కోసం రూ.60వేలు పట్టుకుని కార్యదర్శి దగ్గరికి పోయిన. సెక్యూరిటీ గార్డుకు ఇవ్వమన్నడు ఇచ్చిన. ఏసీబీ సార్లు వచ్చి పట్టుకున్నరు. ఆయన అరాచకాలు, వేధింపులు భరించ లేకనే ఈ పని చేయాల్సి వచ్చింది. కూరగాయ వ్యాపారుల నుంచి కూడా పెద్ద మొత్తంలో పట్టిచ్చిండు. పాపం వాళ్లు కూడా మొత్తుకుంటున్నరు. ఆయన వచ్చిన ఐదేళ్లల కమ్‌సే కమ్ రూ.5కోట్లు కమాయించిండు. ఎప్పుడు చూసినా పైసలే అంటడు. నాకు 1.06 లక్షలు ఇయ్యాలే. అడిగితే బెదిరిస్తడు. ఇది చేస్తా.. అది చేస్తా అంటడు.

**- మహ్మద్ గఫూర్ అలియాస్ నిమ్మ కాయల పాషా (పురుషోత్తంను పట్టించిన పండ్ల వ్యాపారి)**